

గత సంవత్సరం ఆఖరులో పారిస్ నగరంలో '15వ అంతర్జాతీయ నాట్యోత్సవాలు' జరిగినపుడు ఎనభై ఎనిమిది దేశాలు పాల్గొన్నాయి. భారతదేశం తరపున ఈ ఉత్సవాలలో పాల్గొన్న మల్లికా సారాభాయి (ఈ మధ్యనే 'వనిత' ముఖచిత్రం మీద చూశారు) 'ఉత్తమ నర్తకి'గా నిర్ణయింపబడడం విశేషం! ఈ ఉత్సవ నిర్వాహకులు ఆమెకు 'బంగారు నక్షత్రం' బహుమతిని యిచ్చి, గౌరవించారు.

❋

స్త్రీ ఓటర్లే ఎక్కువ!

మళ్ళీ ఎన్నికలొస్తున్నాయి. ఆ సంరంభం, సందడి రాష్ట్రం నలుమూలలా కనిపిస్తున్నాయి. ఈ సారి ఎన్నికల ఫలితాలు చాలా మటుకు స్త్రీల ఓట్ల మీద ఆధారపడి వుంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. కారణం—రాష్ట్రంలో 1,42,75,524 మంది స్త్రీ ఓటర్లు వుంటే, పురుషుల సంఖ్య 1,40,50,950 మాత్రమే! ఇక జిల్లాల వారీగా పరిశీలిస్తే తూర్పు గోదావరి జిల్లా—మహిళా ఓటర్ల విషయంలో అగ్రస్థానం వహిస్తున్నది. ఇక్కడ పురుషులకన్న స్త్రీ ఓటర్ల సంఖ్యే అధికంగా వుంది!

# ఒక్కర్నిమించి ఒక్కరు

## శీలంశెట్టి రమాదేవి

రామరాజు ఎదురుగ్గా ఉన్న ఫొటోల వంక చూశాడు.

అన్నిటిలోకీ వనజ అనే అమ్మాయి ఫొటో బాగుంది. అందంగానే ఉంది. కానీ ఆ అమ్మాయికి చదువు లేదు. పైగా నలుపట. చదువున్న అమ్మాయిలిద్దరు ముగ్గురు—అస్సలు బావుండలేదు.

అన్నిటినీ విసుగ్గా కవర్లోకి తోసేశాడతను.

తండ్రి బయట పెళ్ళిళ్ళ పేరయ్యతో మాట్లాడుతున్నాడు.

"ఇదిగో—కవరు!" తండ్రి కందించాడు రామరాజు.

పేరయ్య కుతూహలంగా చూశాడతనివేపు.

"ఎవరయినా నచ్చారా?" అడిగాడు తండ్రి అనుమానంగా.

"ఊహు! అన్నీ హోప్‌లెస్‌గా ఉన్నాయ్..." అనేసి అక్కడినుంచి బయటకు నడిచాడు రామరాజు.

ఈ పెళ్ళి వ్యవహారం తనకు పరమ చిరాకు కలిగిస్తోంది. ఒకటి కాదు, రెండు కాదు ఆరు నెలల నుంచీ అందమయిన అమ్మాయి కోసం గాలిస్తున్నాడు తను. పెళ్ళికొడుకులు దొరకడం లేదనీ, ఆడపిల్లలు ఎక్కువయిపోయారనీ అందరూ అనుకోవడం తనకు తెలుసు. మరి తన దగ్గర కొచ్చేసరికి ఒక్క ఆడపిల్ల కూడా అందమైనది కనిపించడం లేదు.

తను అందగాడు కాదు. నిజమే. కానీ అలా అన్జెప్పి అందవికారి కూడా కాదు. పెళ్ళాన్ని తేలిగ్గా పోషించుకోగల ఉద్యోగం చేస్తున్నాడు. బాదరబందీ లేదు. సొంత పెంకుటిల్లుంది. పెన్షన్ వచ్చే తండ్రి, తల్లి—అంతే! మరి తనకెందుకని అందగత్తెలయిన అమ్మాయిలు కనిపించటం లేదు.

రోడ్డుమీద నాలుగడుగులు వేసేసరికి శారద గుర్తుకొచ్చింది. అనుకోకుండానే పక్కకు తల తిప్పి చూశాడు. కిటికీలోనుంచి తనవేపే చూస్తోంది శారద. తనను చూడగానే నవ్వేసింది.

"ఎక్కడికెళ్తున్నావ్?" అడిగింది నెమ్మదిగా.

"మాట్నీకి...."

"మాట్నీకింకా చాలా టైముందిగా—" ఆహ్వానిస్తున్నట్లు అంది.

నిజమేననిపించింది రామరాజుకి.

గేటు తీసుకొని ఆమె ఇంట్లోకి నడిచాడు.

"పెళ్ళి సెటిలయ్యిందా?" నవ్వుతూ అడిగింది.

"ఆ—నా మొహం అవుతుంది." విసుగ్గా అన్నాడు రామరాజు.

"అదేం?" ఆశ్చర్యపోతూ అంది.

"ఒక్క అమ్మాయి కూడా బావుండలేదు. ఇంకా వారం రోజుల శెలవే మిగిలింది. ఈ లోపల కుదిరేట్లు కనిపించటంలేదు...."

శారద అతనివంకచూసి చిరునవ్వు నవ్వి తల దించుకొంది. కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా గడిచినయ్.

"మరి నీ పెళ్ళెప్పుడేమిటి?" నవ్వుతూ అడిగాడతను.

"చూస్తున్నారు మా వాళ్ళు...." తల వంచుకునే చెప్పిందామె. ఆ క్షణంలో ఆమె గుండెలు ఏదో చెప్పాలని ఎగసిపడినాయ్. అతని వంక చూడాలని ప్రయత్నించీ చూడలేకపోయింది.

పదేళ్ళపాటు కలసి చదువుకొన్నారు. దగ్గరే ఉన్నాయ్ ఇద్దరిళ్ళూనూ. మనసులు కూడా దగ్గరవాలని అనుకొంది తను. కానీ అతనికా ధ్యాసే లేదు. తననెందుకు ఆ దృష్టితో చూడటం లేదో ఇటీవలే అర్ధమయింది. అతనికి చాలా అంద

మయిన అమ్మాయ్ కావాలి. తనలాంటి యావరేజ్ అమ్మాయిలు అతనికి నచ్చరు. ఆరోజు నుంచే తను అతని గురించి ఆలోచించడం మాని వేసింది. అతనితో అదివరలా అతిగా మాట్లాడడం తగ్గించి వేసింది. కానీ అతను కనిపించినప్పుడు మాత్రం అతనితో మాట్లాడాలని ప్రాణం కొట్టుకుపోతుంది. నిజానికి అతని అందానికి తనే మాత్రం తీసిపోదు. వక్క పక్కన నిలబడితే తప్పక అతనికన్న తనే ఎక్కువ మార్కులు కొట్టేయగలదు కూడా! అయినాగాని అతని దృష్టి తన మీద లేదు. ఎక్కడో ఆకాశంలో



ఉంది. దేవకన్యల్లాంటి అసాధారణ అందగత్తెల మీద ఉంది.

"శారదా........" బయట నుంచి ఎవరిదో సన్నని గొంతు వినిపించింది.

శారదతోపాటు తనూ కిటికీలో నుంచి బయటకు చూశాడు రామరాజు.

అతని కళ్ళు జిగేల్‌మన్నయ్. గుండెలు వేగంగా కొట్టుకొన్నాయ్. ఇదే........ఇలాంటి అందగత్తెకోసమే తనిన్నాళ్ళూ ఎదుర్చూసింది. ఇంత అందమయిన అమ్మాయ్ ఈ ఊళ్ళోనే ఉందా? అదీ శారదకు స్నేహితురాలయి ఉన్న విషయం తను తెలుసుకోలేకపోయాడా? ఎవరీ అమ్మాయ్? బహుశా ఈ ఊరికి కొత్తగా వచ్చి ఉండాలి వాళ్ళు. తను ఈ ఊరు వదలి అయిదేళ్ళవుతోంది. అందుకే ఊర్తో 'టచ్' పోయింది.

కొద్ది క్షణాలు శారదా, ఆ అమ్మాయీ బయటే మాట్లాడుకొన్నారు. ఆ అమ్మాయిని శారద లోపలకు ఆహ్వానిస్తే బావుండునని అర్జంటుగా దేముడిని మొక్కుకొన్నాడతను. కానీ దేముడు అతని మొక్కుని ఖాతరు చేయలేదు. ఆ అమ్మాయిని పంపించివేసి లోపలికొచ్చింది శారద. ఆమెని వెళ్ళిపోయేముందు జాగ్రత్తగా పరిశీలించాడు రామరాజు. అద్భుతమయిన అందం. ఎలాంటి అవలోపమూ లేదు. పెళ్ళికాని యువతేనని స్పష్టంగా తెలిసిపోతోంది.

"ఎవరా అమ్మాయ్" ఆత్రుతగా అడిగాడతను శారదని.

"ఆ సందు చివరింట్లోకి కొత్తగా వచ్చారు సంవత్సరం క్రితం. క్రిందటేడు ఇద్దరం ఒకటే క్లాసు...." చెప్పింది శారద.

"అదే చూస్తున్నాను. నేను చదివేటప్పుడు ఎక్కడా కనిపించని అమ్మాయ్ హఠాత్తుగా ఎలా ప్రత్యక్షమయిందా అని...." నవ్వుతూ అన్నాడు రామరాజు.

శారద నవ్వి ఊరుకొంది.

"వాళ్ళ నాన్నగారేం చేస్తారు?" ఆమెకు అనుమానం రాకుండా – మామూలుగా అడిగినట్లు అడిగాడతను.

"బాంక్‌లో క్లర్కట...."

"ఓహో....! మరి నేను వెళ్ళిరానా?" హడావుడిగా లేచి నిలబడ్డాడు.

తలూపింది శారద. రామరాజు బయటికొచ్చేశాడు.



కవల పిల్లల్లాగ కనుపించే యీ అమ్మాయిలు, అక్కా, చెల్లి–ఖమర్‌సుల్తానా, నూర్జహాను. పదిహేను, పధ్నాలుగు సంవత్సరాల వయస్సు. ఊపిరి సంబంధమైన వాద్యాలు, వేణువు, నాదస్వరం వంటివి వాయించే స్త్రీలు దేశం మొత్తం మీదే అరుదుగా వున్నారు. ఇంక క్లారినెట్ ఇరవై రెండు బీగాల ('కీ')తో స్వరమేళనం చేయవలసిన వాద్యం. ఇది వాయించే స్త్రీలు దేశంలో దాదాపు లేరనే చెప్పవచ్చు. గత ఒకటిన్నర సంవత్సరాలుగా తమ తండ్రి ప్రఖ్యాత క్లారినెట్ విద్వాంసులు శ్రీ షేక్‌హుస్సేన్‌సాహేబుగారి వద్ద విద్య నేర్చుకుంటున్నారు యీ చిరంజీవులు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం నుండి వీరి క్లారినెటు యుగళ సంగీతం–బాలవినోదం, యువవాణి కార్యక్రమాల్లో ప్రసారమైంది. వీరిద్దరూ చిన్న చిన్న కచ్చేరీలు కూడా ఇస్తూ–ప్రశంసలు అందుకుంటున్నారు.

—జె. ఆర్.

లయన్ లేడీస్‌క్లబ్బు, (విశాఖపట్నం) 25 డిసెంబరు (1977) నుండి 5 మార్చి (1978) వరకూ విశాఖ సేవాసదన్ రామ్‌నగర్ అప్పర్ ప్రైమరీ స్కూలులో నిర్వహిస్తున్న ఉచిత పోలియో అండ్ ట్రిపుల్ యాంటిజెన్ వైద్య శిబిరాలకు డా॥ ఇందిరాబాయి — ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమం నెలకు రెండు దఫాలుగా మూడు నెలలపాటు జరుగుతుంది. మొదటిసారిగా వందమందికి పైగా చిన్న పిల్లలకు యీ పోలియోమందులు, ట్రిపుల్ యాంటిజెన్ వాక్సీను యివ్వడం జరిగింది. డా॥ పి. భ్రమరి, లయన్‌లేడీ డా॥ ఎమ్. సన్యాసమ్మ సహకరిస్తున్నారు. స్కూలు మేనేజిమెంటు కమిటీ, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కృష్ణవేణి తదితర ఉపాధ్యాయవర్గం, విశాఖనార్త్ లయన్‌లేడీస్ అక్సిలియరీ కార్యదర్శి శ్రీమతి సరస్వతి తగిన సహాయాన్ని అందజేస్తున్నారు.

—విలేకరి



అతను ఆనందంతో ఉక్కిరిబిక్కిరవు తున్నాడు.

చాలా అసాధారణమయిన అందగత్తె ఆ అమ్మాయ్. తనక్కావలసింది ఆ అమ్మాయే.

తను కలలుకంటోంది అలాంటి సౌందర్యవతి కోసమే.

శారదలాంటి మామూలు ఆడపిల్లలు కోకొల్లలు. అలాంటివారు తనకొద్దు. తన చదువుకొన్నాడు.

ఉద్యోగం చేసుకొంటున్నవాడు. కొద్దోగొప్పో ఆస్తిపాస్తులున్నవాడు. చూడడానికి బాగానే ఉంటాడు. అంచేత తనకి కావలసిన ఆడపిల్లని సెలక్ట్ చేసుకొనే సౌకర్యం ఉంది. ఆ సౌకర్యాన్ని తను పూర్తిగా వినియోగించుకొంటున్నాడు.

మనసులోని విషయం వెంటనే తండ్రికి చెప్పాడు రామరాజు. ఆ పిల్ల అడ్రస్ అందించేడు తెలిసినంతవరకూ.

తండ్రి ఆనందంతో పొంగిపోయాడు. అసలు తన కొడుక్కి నచ్చే పిల్ల ఈ భూలోకంలో లేదేమోనని ఆదుర్దాపడుతున్నాడు.

వెంటనే కండువా భుజానేసుకొని బయల్దేరేడాయన.

రామరాజు ఆయన కోసం ఎదురూస్తూ కూర్చున్నాడింట్లో. ఎంతసేపటిగ్గాని తండ్రి తిరిగి రాలేదు. ఆయన మొఖంలో ఆదివరకటి విసుగూ, చికాకూ మళ్ళీ చోటు చేసుకొన్నాయ్.

"ఏమన్నారు నాన్నా...." ఆత్రుతగా అడిగాడు రామరాజు.

"నీ ఫోటో కావాలిట. ఆ అమ్మాయికి నీ ఫోటో నచ్చితే అప్పుడు మిగతా విషయాలు మాట్లాడతారట...."

ఆశ్చర్యపోయాడు రామరాజు.

అమ్మాయికి తను నచ్చడమా? అందుకు ముందు ఫోటో పంపడమా? అదేమిటి?

"ఇప్పటికే నలుగురైదుగురు అబ్బాయిలు కానీ కట్నం లేకుండా చేసుకొంటామని కబుర్లు చేసేరుట. అందరూ మంచి ఉద్యోగుస్తులే. ఒకతను ఆఫీసరు కూడానట. వీళ్ళుకాకుండా ఆ పిల్ల బావ కూడా తననే చేసుకోవాలని పట్టుపడుతున్నాట్ట. వాళ్ళందరి ఫోటోలు చూసిగానీ నిర్ణయించుకోదట ఆ అమ్మాయ్...."

రామరాజు పూర్తిగా నిరుత్సాహపడిపోయేడు.

అందులో అనౌచిత్యం ఏమీ కనిపించ లేదతనికి.

తను, తనకు మించిన అందం కోసం వెతుకుతున్నాడు. ఆ అమ్మాయి ఆమెని మించిన అందగాడికోసం వెతుకుతూంది. తను తనక్కావలసిన అందగత్తెని సెలక్ట్ చేసుకోడానికి ఫోటోలు తెప్పించినట్టే ఆమె ఆమెక్కావలసిన అందగాడిని సెలక్ట్ చేసుకోడానికి ఫోటోలు తెప్పించుకొంటోంది. ఇది సెలక్షన్. అంతే! □




క్రీడారంగంలో కూడా ఎందరో వనితలు కృషి చేస్తూ రాణిస్తున్నారు. ప్రశంసలు అందుకుంటున్నారు. అటువంటి వాళ్ళలో కుమారి రెడ్డి విజయలక్ష్మి ఒకరు. పన్నెండు సంవత్సరాలుగా విజయలక్ష్మి 'స్పోర్ట్స్'లో కృషి చేస్తూ-వెగ్గుకొస్తున్నారు. కృష్ణా జిల్లాలో జరిగిన 'గ్రిగ్ మెమోరియల్' పోటీలలో-ఆమె తొలిసారిగా 'టెన్నికాయిట్ ఛాంపియన్'గా ఎన్నుకోబడింది. అప్పుడే, హైద్రాబాదులోని వ్యాయామకళాశాలలో-విద్యార్థినిగా చేరి, క్రీడలలో కృషి చెయ్యసాగింది.

1970 లో ఢిల్లీలో జాతీయ స్థాయిలో కబడీ పోటీలు జరిగాయి. ఆంధ్రదేశం తరపున – విజయలక్ష్మి అందులో పాల్గొన్నది. '72 లో 'నేషనల్ స్టాఫ్‌బాల్ ఛాంపియన్‌షిప్'కు జరిగిన పోటీల్లో ఆమెకు మూడవస్థానం లభించింది. '73 లో అందులోనే - 'స్టేట్ ఛాంపియన్'గా ఎన్నికైంది! ఆ సంవత్సరంలోనే ఆమె - టెన్నికాయిట్ పోటీల్లో ఘన విజయాలు సాధించి - ప్రశంసలు పొందింది. ఇలా ప్రతి సంవత్సరం – ఆమె పలుక్రీడలలో పాల్గొంటూ, బహుమతులు అందుకుంటున్నది.

ప్రస్తుతం-విజయలక్ష్మి హైద్రాబాదులోని 'ఆర్య కన్య విద్యాలయము'లో వ్యాయామ అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఆమె బి. ఎ.; ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 'డిప్లొమా' కూడా వున్నది. విజయలక్ష్మి వయసు 27 సంవత్సరాలు.

—రావినూతల రాజ్యలక్ష్మి